# హరికతలు యినేవాళ్లకేనా?

''మన దేముడి సత్తిం ఆహా! మనకు తెల్దా? తెలవకుండా పోతే వాగిసినా నసిగినా దానికొక అర్తం పర్తం ఉంటింది. తెల్సు గదా? ఈ పొద్దా? యిప్పిటికి ముప్పయి ఏండ్లుగా చూస్తానే ఉండ్లా. ఊలోళ్లకు యినుము కొట్టమంటే యిర్సుకోనిపాయ్ పడ్తారు. అదే తనోళ్లకు తగరం తట్టమంటే తలపట్టుకోని కూసుంటార్లే?... పాలోళ్లకు పాలంటే ఉచ్చపోసేరకం...''

మంచి ముగ్రుమిందుండే గొడ్డు మోరవొంచి కాలుగీరిందంటే పోట్లాటకు సై! అంటే సై! అన్నెట్టే లెక్క. నేనేం ఎర్రోణ్ణా? తన దేముడి సత్తిం తనకు తెలిస్తే నా దేవత కత నాకేనా తెలవకుండా పొయ్యింది. పడకమింద ఉండంగానే ఏడుకొండలవాడి గుళ్లో అయ్యోర్లంతా కల్సి పలకాల్సిన సుప్రబాతం మా యింట్లో మారుమోగి పోతా వుండాదంటే? – ఆ పొద్దు నాకేందో మూడేది మాత్రం ఖాయం.

''ఓరి! బగమంతుడా! ఈ పొద్దు నన్నెట్టా రచ్చిస్తావో నీదే బారం తండ్రీ!'' అని గుణస్తా గుణస్తానే లేసినా.

''ఆడెవుడో ఒకపిలగాడు. వాళ్ల అయ్య దగ్గిరికి పొయ్‌నాడంట. 'అయ్యా! అయ్యా! ఏనిగ! – అది ఎట్లుంటింది' అని అడిగినాడంట. ఆ అయ్య శాతొచ్చిన కాడికి ఏనిగ ఎట్లుంటిందో యివరించి చెప్పచ్చు. లేకుంటే ఒక ఏనిగ బొమ్మను తెచ్చి చూపించచ్చు. అపనే చేసుంటే యింక ఆ మణిసిని గురించి మనం చెప్పుకుండే దానికి ఏముంటుంది?

ఆ అయ్య ఏం చేసినాడంటే? –

బిడ్డ అడిగిందే చాలనుకున్నాడంట. ఎకాఎకిని ఎలబారి నేరుగా ఒక సర్కస్ కంపెనీ వాళ్ల దగ్గిరికి పాయ్‌నాడంట. వాళ్లు అడిగినంత యిసిరి ఎడనుచేత్తో వాళ్లమొకాన పారేసినాడంట. ఏనిగిని యింటి ముందిరికి తెచ్చి నిలబెట్నాడంట!

అప్పుడు ఆ పిలగాణ్ణి ఆ ఏనిగిమిందికి ఎక్కించి ఆ ఊళ్లో నాలుగు యీదులు మెరవణి తిప్పించి మల్లా ఆ ఏనిగిని ఎనిక్కి పంపించినాడంట!

పిలగాడు ఏనిగ ఎట్లుంటింది? అని అడిగే కుందిక దాని మిందికే ఎక్కించి చూసుకో పోరా! అనె. లోకంలో అటుమంటి కారివేదులూ ఉంటారు. ఈ కొంపలో మాదిర్తో కోసగాళ్లూ ఉంటారు.''

ఆ కత యినే కుందికి నిద్దర మత్తు ఎట్టా పాయ్‌నో పాయ!

''ఒకే పారిగా కొండకే మోటిస్తా ఉండాదే నిచ్చిన. ఎట్టా కడతేర్స బోతావురా నా తండ్రీ!'' అని యాదన పడ్తా ఉండా.

''నేనేమన్నా కొండల్ను తొవ్వమన్నానా? లేదు ఆ కొండ మిందుండే కోతిని దెచ్చి యీమన్నానా? లేదే? ఆ పద్మావతీ కాలేజీ కాడికి పాయ్యొచ్చేకుందికి ఎంత సేపు పట్తింది. ఒక వక్క కొరికినంత సేపు పట్నా? పాయ్యి అడిగుంటే ఎవురైనా ఏసే వాళ్లు గదా?''

''నిజమే! నిజమే! ఆ పద్మావతీ కాలేజీ కాడికి పాయ్ ఎవుర్ని అడిగినా ఏసేది మాత్రం ఖాయం. పిచ్చిదానా! అంత దూరం ఎందుకే? ఆడ ఎవుర్నన్నా అడిగినానని నీ చెవల్లో పడుంటే చాల్దా? నువ్వే ఏసే దానివి. లేదంటే వొగిటే తేడా. వాళ్లయితే కాల్లో ఉండేది చేతికి తీసుకోని ఏసుంటారు. నువ్వు దేంతో యాస్తావో ఆ దేముడికే ఎరిక!''

''ఈ యాసణ్ణం మాట్లే వద్దని ఎన్ని మాట్లు చెప్పినా.''

''ఈ నస బెట్టే కతలే వద్దని నే నెన్ని సార్లు మొత్తుకుణ్ణా!''

''ఇడవకుండా నసబెట్తా ఉండంగానే బతుకు ఆడికాడికి ఉండాది. లేకుండా పోతేనా...''

''తెగేదాకా లాగద్దే!''

''ఈ యినుము నానేసే బుద్ధి నీ కొద్దే!''

''ఇనుము నానదు. నువ్వు నన్ను వదలవు. నాకెట్టా తప్పదు. ఏం చెయ్యాల్నో ఒక మాట్తో చెప్పి ఏడవచ్చు గదా?''

''ఏడ్సి ఏడ్సి ఎప్పుడో మొకం గూడా కడుక్కుణ్ణా. ఇంక ఏముండాది గానీ ఏడ్సే దానికి? రొండంటే రొండే మార్కులు. అట్టా ఎయ్‌పించేసి ఉంటే? మా బిడ్డ గూడా ఫస్టుకళాస్ అని చెప్పుకోనుండచ్చు గదా?''

''ఫస్టక్లాస్ కాకుండా పోతే పోనీలే సెకండ్ క్లాస్. ఇప్పుడేం కొంపలు మునిగి పాయ్‌నాయని.''

'' నీగ్గూడా ఆ కాంగ్రెసోళ్ల బుద్ధి అబ్బినట్టుండాదే? లేకుండా పోతే ఆ పోజిట్టు పార్టీ వాళ్లంతా 'ఒక తాటిమింద నిలబడి చెయ్యి చెయ్యి కలపదాం ఆ చేతిని నరకదాం!' అని సత్తేలు బాసాలు చేసుకుంటా గోసి పేతలు ఎగచెక్కుకుంటా ఉంటే ఈ కాంగ్రెసోళ్లు యిప్పుడేం కొంపలంటక పోతా ఉండాయంటా నిమ్మకు నీరెత్తినట్టుండ్లా!''

''వద్దే! మనకొద్దే. పాసి పండ్లతో పాలిటిక్స్ మనకొద్దే అని యింతకు ముందొకసారి గూడా చెప్పినా. నా మాటంటే నీకొక జమా లెక్కా?''

''పరగడుపో. పాసి పండ్లో కాదే ముక్కెం. నువ్వొక పిచ్చోడుగా ఉండావ్. కారవేదికి కార్యెం మింద కన్నుండాల్నే. అదే మన ముక్కెమంత్రి రామన్నను తీసుకో. ఒక పక్క వరదలొచ్చి ఊర్లకు ఊర్లే మునిగి పోతా ఉండాయ్. ఇంగొక పక్క నిలవను నీడలేకుండా అల్లాడే వాళ్లు అల్లాడ్తా ఉండారు. చచ్చేవాళ్లు చస్తా ఉండారు. అయినా దినమూ చచ్చేవాళ్లకు ఏడ్చే వాళ్లు ఎవురని సక్కాపాయ్ డిల్లీలో కూసోలా! ఎందుకు కూసుండె? – పంగమాలి పాయ్ కూసుణ్ణాడా? కార్యం మిందనే కన్నుండే మొనగోడు కాబట్టి పాయ్ కూసుండె.''

''తెలుగు ఆడపడ్సులు... తెలుగు అన్నలు... తెలుగు తమ్ముళ్లు ఈడ కుమిలి కూరాకై పోతావుంటే డిల్లీలో అంత గొంతల మింది కొచ్చిన కార్యం ఏముండాదబ్బా?''

''డిల్లీ కోట మింద కన్ను పడె!''

''డిల్లీ కోటంటే ఏమి నాచారంలో బూములను కున్నావా? అబిడ్స్‌లో అంగుళ్లేమన్నా అనుకున్నావా? కన్ను పడితే కొనుక్కుండే దానికి. రొండో కంటికి తెలవకుండా అమ్ముకుండే దానికి!''

''నువ్వు యిట్టా నోరు పారేసుకునే గదా దోవన పొయ్యే జగడం ఇంటి దాకా వచ్చేది. డిల్లీ కోట మింద కన్నంటే పిచ్చోడా! అర్వై ఎనిమిది కోట్ల బారతీయుల మింద కన్నే! అన్న హయాంలో ఆరున్నర కోట్ల మంది తెలుగు ప్రెజలుసుకపడి పాయ్‌నారా. ఈళ్ల సుకమే చూసుకుంటా ఈణ్ణే స్తిమితంగా కూసుంటే అది వలపచ్చిం అయిపోలా?''

''ఇల్లు అలగ్గానే పండగై పోతిందా?''

''అయితిందో కాదో అది కాదే ముక్కెం. కార్యెం మింద కన్ను పడిందంటే మిన్నిరిగి మింద పణ్ణా యిడ్సి పెట్టొచ్చా? చూడు మొనగోడు. పట్టు ఇడ్సి పెట్టకుండా అందుర్ని సమకూర్చినాడా? నేషనల్ ఫ్రంట్ ఏర్పాటై పాయ్‌నా? దానికి చేర్మన్ అయ్‌పాయ్‌నాడా? మొనగోడు మొదులు పెట్టె. కత్తి కింక ఎదురు లేకుండా నరుక్కోని పోతానే ఉంటాడు. కన్నేస్తే అట్టైయ్యాల్నే?''

''అయితే ఇప్పుడు నన్ను ఎవురిమింద కన్నెయ్య మంటావ్.''

'' పనికి రాని పాపర ముండ మింద కన్నేసి బయిసార్సుకుణ్ణావ్. చాలదా? మణిసి అన్నాక కార్యం మింద కన్నుండాల్నే అంటే యాసణ్ణం పడితే ఎట్నే?''

''ఇద్దో నన్నిట్టా చావగొట్టి చట్లో పెట్టకపోతే ఆ చెప్పేదేందో ఒక్కమాటతో చెప్తే పోలా?''

''ఈ కాలంలో గూడా ఇంకా ఒకరు చెప్పేది... ఒకరు యినేది. అదే అయ్యే పనేనా? పొయ్యే పనేనా? వాళ్ళంతట వాళ్లకే మణుసులో పడాల. మణుసులో పడాల్నే గానీ మల్లా నిద్దర రమ్మంటే గూడా వస్తిందా? రొండో కంటికి తెలవకుండా ఎంతమంది అయిద్రాబాద్‌కు పోలా? పాయ్ పన్లు చక్కచేసుకోని రాలా?

నిరుడు తడిం బుడిం మార్కుల్తో తప్పాయ. ఈ ఏడు ఫస్టు కళాస్. ఎట్లొచ్చింది.

ఆ పిలగాడి అబ్బ అయిద్రాబాద్‌కు పొయ్యొస్తే వచ్చింది. ఆడ కూసోని ఎట్ల చేసినారో? ఏమి చేసినారో? ఎవురి కన్నా తెలుసునా? తెల్సింది పిలగాడు ఫస్ట్ కళాస్ అని. నువ్వు అంత దూరం పోవాల్సిన పని గూడా లేకపాయనే. ఊళ్లో ఉండే కాలేజీ కాడికి...''

''పొయ్యొచ్చుంటే నీ బిడ్డ ఫస్ట్‌క్లాస్. దాంతో ఒరిగింది ఏందే పిచ్చి మొకమా? ఈ పొద్దు మనం చేసే ఒక చిన్న తప్పుతో ఒక నాటికి ఎంత మంది బాద పడతారో తెలుసునా? కాళ్లా యాళ్లా పడి కాపీ గొట్టించే వాళ్లుండారు. అడ్డ దోవలు తొక్కి మార్కులు ఎయ్‌పించుకుండే వాళ్లుండారు. డొనేషన్లు పెట్టి సీట్లు కొట్టేసే వాళ్లుండారు. ఈళ్లంతా రేపు డాక్టర్లు!... ఇంజినీర్లు!... మనం ఒక తప్పు చేస్తే ఆ తప్పుతో బాద పడితే మనమే బాద పడ్తాం. కాదంటే కాసింతో కూసింతో నష్టపడతాము. ఇటుమంటోళ్లు చేసే తప్పుల్తో రేపు దేశమే బాద పడ్తింది. ఇంక నష్టం మాటంటావా? చెప్పే దానికి అలివిమాల్దే!

కాకి పిల్ల కాకికి ముద్దు. కాదనే దానికి లే. అయినా ఇటుమంటి బుద్ది మాల్నె పనులు బుద్దుండే వాడెవుడూ చెయ్యడే. అదే కొందురు పిలకాయిలు ఉంటారు. రంజకాలు. సివ్వల మాదిర్తో దూసుకోని పోతా వుంటారు. అటుమంటోళ్లకు శాతైన కాడికి చెయ్యందిస్తే పున్నెం పురుషార్దమన్నా ఉంటింది. తలకాయిల్లో ఏమీ లేనోళ్లని పట్టుకోని ఊగులాడే కత ఉండాదే? మేక మెడ కింద లింగాల్ను పట్టి పితికే యవారమే!'' అని చెప్పాలనుకుంటి. కానీ చెపితే యినిపించుకుండే రకం గాదే?

అప్పటికే చిన్నకూతురు మూలకూసోని మార్కుల్లిస్ట్ కల్లా చూసుకుంటా చీదిచీది యేస్తా ఉండాది. ఆ బిడ్డ దగ్గిరికి పోతి.

'' ఈ యేడుపు పరీచ్చలకు ముందుగనే ఉణ్ణుంటే యిప్పుడు యిట్టా తీరుబాటుగా కూసోని యేడవాల్సిన పని ఉండదు గదమ్మా? దీన్నే మీ తెలుగు అయ్యోరు యింకొక మాదిర్తో చెప్పించి ఉంటాడు. అదే చేతులు కాల్నాక...'' అంటా ఉండానో లేదో మాబాశాలి పైటకొంగు ఈడ్సి నడుముకు చెక్కుకుంటా ఒక్క యిసుర్లో ఆడకొచ్చి ''నీ రావిడి రగల బడి పోనాని ఆడికి నిలిపే!'' అనె.

ఇంకేముండాది అపీలే లేని ఆర్డర్ పడిపాయ.

నోరు మూసుకుంటి. రొండు చెంబులు నీళ్లెత్తి అట్టొక చెంబు యిట్టొక చెంబు వొంటి మింద కుమ్మరించుకుంటి. ఆపె ఎదురుగా ఉంటే గిచ్చి జగడానికి పిలిస్తింది. మాటకు మాట పెరిగితింది. వద్దనుకుణ్ణా నెత్తిన రొండు అచ్చింతలు పడ్తాయి. అందుకే యింటి కంటే గుడి బద్రమని ఎలబార్తి.

ఆకాశిం కడిగి తోసినట్టుండాది. రేపటెండ సురక్ సురక్ మని సూదుల్తో పొడిసినట్టుండాది. మా బాశాలి పణ్ణె బాద తల్సుకుంటా ఉంటే మణుసు మూడారు దోవలాయ. ఆ మూడారు దోవల్లో ఒక దోవపట్టుకోని పోతా ఉంటే ఒక ఊరు. ఆ ఊరికి పెద్ద పేరుండాది. పెద్ద పేరుండే ఆ ఊళ్లో పెద్ద అయిస్కూలుగూడా వొగిటి ఉండాది. ఆ అయిస్కూల్ హెడ్మాష్టర్ జిల్లాకంతా పేరెత్తిన మొగలాయి!

తేనె తినేదానికి తియ్యగా ఉంటింది. అట్టని కత్తికి పూసుండే తేనెనే నాకితే? ఆ హెడ్మాష్టర్ తంటకు పోతే అంతే కత. అయిస్కూల్లో అయ్యోర్లకు తెల్సినకాడికి అంతో యింతో ఒకరికి చెప్పేవాళ్లే కానీ చెప్పించుకుండే వాళ్లు కాదు గదా?

అందుకే వాళ్ల జాగర్త మింద వాళ్లుండారు.

ఇంక ఆ హెడ్మాష్టరుండాడే? మణిసి శానా ఫలాతన్. ఎదిటోడు వాడు ఎటుమంటి వాడైనాకానీ వాడి చెవులో పువ్వు బెట్టి జుట్లో దూరి పామ్మంటే అలాగ్గా దూరి పోతాడు.

ఆ పెద్దయ్యోరికి ఒకడే కొడుకు! ఒక కన్ను కన్నుగాదు. ఒక బిడ్డ బిడ్డగాదంటారు. అందుకే కిందికి దించితే మట్టి అవితింది. పైకెత్తుకుంటే గెద్ద తన్నక పోతింది! అని శానా ముదిగారంగా సాకినారు. ముదిగారం కుక్కమూతులు నాకితిందంటారు. అయితే అందురు వాణిమూతి నాకేవాళ్లే!

అట్టా మూతినాకి ముద్దులాడుకుంటా ఉణ్ణె యాళకాడ ఆపిలగాడికి అవ్వ కొడుకును దగ్గిరికి పిల్సిందంట. మనవణ్ణి చూపిస్తా 'నా బంగారుకొండ! నా వరాలమూట! నువ్వు ఏం చేస్తావో? ఎట్ట చేస్తావో? నాకు తెల్దు. ఈడు డాక్టర్ కావాల్సిందే!' అని చేతిలో చెయ్యేసి మాట తీసుకుణ్ణిందంట!

తల్లి మాట జవదాటలేదే ఆ పెద్దయ్యోరు!

ఆ పిలగాడు ఎస్సెస్ యల్సీలో జిల్లాకంతా ఫస్ట్. ఇంటర్‌లో డిస్టింక్షన్. ఎందుకు రాదు? గైడ్లు చేతికిచ్చి గైడెన్సుగూడా యిస్తావుంటే?

ఆ హెడ్మాష్టరు పనిమంతుడు. ఎట్టా పలుకుబడి ఉండె. దాన్ని శానా బాగా వాడుకుండె. ఇప్పటి మాదిర్తో ఎమ్ సెట్లు గిమ్ సెట్లు ఏమీలే. ఇంటర్‌లో ఎవుడికి మార్కులు జాస్తిగా వొస్తే వాడికే సీటు. ఆ పిలగాడు మెడికల్ కాలేజిలో చేరిపాయ. చూస్తా చూస్తా ఉండంగానే డాక్టరైపాయ!

అప్పుడు వాడి అవ్వ యాలోకంలో ఉణ్ణిందో ఏంపాడో గానీ మనవడు డాక్టరైపోయ్ నందుకు శానా కుశాల పడిపాయ్ ఉంటింది. అయితే వాళ్ల అయ్య మాత్రం ఒక నాడు నెత్తి నెత్తి కొట్టుకుండె. నేలపడి పొర్లాడె! ఎందుకంటే ఆ మొనగోడు మంచాన పణ్ణె వాళ్లమ్మకు వైదిగం చెయ్యపాయ్ వొకదానికొకటి చేసె. 'కొడకా! నీచేతి మాత్ర వైకుంట యాత్ర' అంటా మహాతల్లి ఒగిటే సారిగా ఎలబారి పాయ- పొసుపు కుంకంతో!

ఈ దేశింలో యిటుమంటి కేసులు ఎన్నుండాయో? ఏంపాడో అని ఆలోచించు

కుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్యేకుందికి ఆడ జనం ఉడ్డలుడ్డలుగా చేరి వాదులాడు కుంటా ఉండారు.

టౌన్‌బ్యాంక్ చేర్మేన్ తన కొడుకే చేర్మేన్ కావాలని పట్టు పట్నాడు. అయిద్రాబాదుకు పొయ్ స్టే తెచ్చుకున్నాడు. దాంతో బ్యాంక్ ఎలక్షన్లు నిలబడి పొయ్‌నాయి. ఈ మాట నాలుగాళ్లమండపం కాడ నలగతా ఉండాది.

''అబ్బ పోతే కొడుకు... వాడు పోతే వాడి కొడుకు... ఎందుకబ్బా ఈ ప్రపంచం యిట్టా కొడుకుల మాయలో పడి కొట్టకపోతా ఉండాదే. పోతేపోనీ! శాతైనోడి వాత మట్టేస్తా ఉండాదే! ఇంట్లో మా బాశాలి... యిస్కూల్లో హెడ్మాష్టర్... బ్యాంక్‌లో చేర్మేన్- అందురూ ఆడికే ఉండారే! అని ఆడ నిలబడుకోని ఆలోచించుకుంటా ఉంటే ముత్తారెడ్డన్న ఎదటపడి ''ఏమిరా అబ్బోడా?'' అనె.

''అన్నా! రాజులకాలాన రాజుల కొడుకులే రాజులంటే రాజీపడకుండా ఈ రాజిరకం మనకు వద్దంటిమి. రాజులు పొయ్‌రి. వాళ్లతోగూడా జమీందార్లు పొయ్‌రి. అయినా అది వర్సాపినిగా వస్తానే ఉండాది గదన్నా

ప్రెదాని కొడుకు ప్రెదాని కావాల్సిందే. ముక్కెమంత్రి కొడుకు ముక్కెమంత్రి కావల్సిందే. చేర్మేన్ కొడుకు చేర్మేన్ కావాల్సిందే! ఈ రాజకీయం యిట్ట యాడస్తా ఉంటే యింక సిల్మాల కత చూడన్నా. మూతి వొక పక్కా ముక్కొక పక్కా చూస్తావున్నా నోరు తెరవలేక పొయ్‌నా హీరో కొడుకు హీరో కావాల్సిందే!

ఈళ్ల కత యిట్టుంటే- చూడన్నా మడక దున్నుకుండే వాడి కొడుకు మడక దున్ను కుంటానే ఉండాడు. కూలోడి కొడుకు కూలోడిగానే ఉండాడు. రిషాతొక్కేవాడి కొడుకు రిషా తొక్కుంటానే ఉండాడు. ఎట్టన్నా యిది?'' అని అడిగే కుందికి ఆయన్న పకపకా నవ్వతా-

ఒరే!! అబ్బోడా! నీకు రావల్సిన సందేహమే వచ్చింది. అయితే ఈళ్లందురికి బుద్ధి చెప్పాల్సిన వాడు ఎవుడ్రా? రచయిత. అవునా? మరి ఆ రచయితే కొడుకుల్ని ఎత్తి బుజాన యేసుకోని! 'మా పిలకాయలకు మించినోళ్లు లేరో?' అని బుజాలెగరేసుకోని తిరగతా ఉంటే ఎవురి మిందనో వాపోతే ఎట్రా. హరికతలు యినే వాళ్లకే గానీ చెప్పేవాళ్లకి గాదే?'' అనె.

వంచిన తల ఎత్తుంటే వొట్టు! ●